
దుగ్గేరు గిరిజనోద్యమ ముద్దుబిడ్డ
కామ్రేడ్ జన్ని తిరుపతి వర్ధంతి సభ



కామ్రేడ్ జన్ని తిరుపతి వర్ధంతిసభలో ప్రసంగిస్తున్న కా॥ ఎస్.ఝాన్సి

దుగ్గేరు, 17-11-16 :

విజయనగరంజిల్లా, మక్కువ మండలం దుగ్గేరు గ్రామంలో నవంబర్ 17, 2016న దుగ్గేరు గిరిజనోద్యమ ముద్దుబిడ్డ కామ్రేడ్ జన్ని తిరుపతి 17వ వర్ధంతి సభ జరిగింది. దుగ్గేరు గ్రామంలో వున్న రైతుకూలీసంఘం (ఆం.ప్ర) కార్యాలయం నుండి వందలాదిమంది గిరిజన ప్రజానీకం ప్రదర్శనగా బయలుదేరి జన్ని తిరుపతికి జోహార్లు తెలుపుతూ, నినాదాలుచేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎర్ర తోరణాలతో ఎరుపెక్కిన దుగ్గేరు – గిరిజనుల సాంప్రదాయక 'కింద్రీ' నృత్యాలు, డప్పుల చప్పళ్లతో మార్మోగింది. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్షుడు కా॥ ఊయక ముత్యాలు ఈ సభకు అధ్యక్షత వహించారు.

సభ ప్రారంభంలో – 2016 జూన్ 10, 11, 12 తేదీలలో గుంటూరులో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల విశేషాలతో సంఘం ప్రచురించిన సావనీరును గిరిజనోద్యమ సీనియర్ కార్యకర్త, మూలవల్స గ్రామ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) అధ్యక్షులు పీడిక అప్పారావు; దుగ్గేరు గ్రామ అధ్యక్షులు గెంబలి లచ్చయ్య, పనసభద్ర గ్రామఅధ్యక్షులు కొండగొర్రి అప్పారావులు ముగ్గురూ ఆవిష్కరించారు.

కా॥జన్ని తిరుపతి వర్ధంతిసభలో ప్రధానోపన్యాసం చేసిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ గిరిజనులలో పెరుగుతున్న సంఘ చైతన్యాన్ని సహించలేక భూస్వామ్య పెత్తందారీ వర్గాలు 1999 సం॥ నవంబర్ 17న దుగ్గేరు గ్రామంపై దాడిచేశారని, దీనిని ప్రతిఘటించడంలో గిరిజన ప్రజానీకం క్రియాశీలక పాత్ర నిర్వహించారని, సంఘాన్ని, ఉద్యమాన్ని కాపాడుకున్నారని ఈక్రమంలోనే కామ్రేడ్ జన్ని తిరుపతిని కోల్పోయామని గుర్తుచేస్తూ నివాళులు అర్పించారు. బాక్సైట్, గ్రానైట్ మైనింగ్‌ల పేరుతో అడవి నుండి, కొండలనుండి గిరిజనులను తరిమివేసి, లక్షల కోట్ల రూ॥ల విలువచేసే సహజ సంపదలను బడాకార్పొరేటు కంపెనీలకు, సామ్రాజ్యవాద సంస్థలకు పాలకులు కట్టబెడ్తున్నారన్నారు. ఆనాడు హక్కులకోసం, భూమి కోసం పోరాటం సాగిస్తే ఈనాడు నీరు, అటవీ వనరులు, సహజసంపదలనన్నీ కాపాడుకొనేందుకు పెద్దఎత్తున పోరాటం సాగించాల్సిన అవసరం వుందన్నారు. 500, 1000 రూ॥లు నోట్ల రద్దుపై మాట్లాడుతూ ఈ చర్య సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది తప్ప, నల్లధనాన్ని బయటకు తీయలేదని, అధికార రాజకీయ నాయకులకు, వారి అనుయాయులైన బడా కంపెనీల యజమానులకు ఈ విషయాన్ని ముందే చేరవేశారని, వారు వివిధ రూపాల్లో తమ వద్దనున్న నల్లధనాన్ని సర్దుకున్నారని తెలిపారు. దేశంలో 40శాతం నిరక్షరాస్యులుగా వుండి, 70 శాతంపైగా వ్యవసాయంపై ఆధారపడి గ్రామీణప్రాంతాల్లో జీవిస్తున్న మనదేశంలో, కనీస వైద్యసదుపాయానికి మైళ్ళకు మైళ్ళు నడచివెళ్ళాల్సిన మన దేశంలో, బ్యాంకు మొఖమే తెలీని వేలాది గ్రామాలున్న మనదేశంలో – ప్రజలు తమ ఆర్థిక కార్యకలాపాలన్నీ నగదురూపంలో కాక, బ్యాంకు కార్డులద్వారా, కంప్యూటర్లద్వారా సాగించాలని చెప్పటాన్ని ఆమె అపహాస్యం చేశారు. ఈ చర్యల వెనుకనున్న పాలకుల అప్రకటిత ఉద్దేశ్యాలను అర్థంచేసుకోవాలన్నారు. పెద్దనోట్ల రద్దు చర్యద్వారా ప్రజలపై మరిన్ని భారాలు మోపడానికి పాలకులు పూనుకున్నారని వీటికి వ్యతిరేకంగా ప్రజలు మరింత ఐక్యమై, సంఘటిత పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సభలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ డి.వర్మ, ఏఐఎఫ్‌టియు–న్యూ నాయకులు కా॥ ఎం.గోపాలం,రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ పి.శ్రీనునాయుడు, కా॥ ఎం. భాస్కరరావు, కా॥ బి.నర్సింగరావు, మక్కువ కళాసీ సంఘం నాయకులు కా॥ సూరిబాబు తదితరులు కా॥ జన్ని తిరుపతికి జోహార్లర్పిస్తూ, గిరిజనోద్యమాన్ని సంఘటితం చేసుకునేందుకు పూనిక వహిస్తామని ప్రతినబూనారు. పనసభద్ర సర్పంచి రతనా పార్వతి, పనసభద్ర ఎంపిటిసి గంటా అప్పలస్వామి ఈ సభలో పాల్గొని కా॥ జన్ని తిరుపతికి నివాళులర్పించారు. బొబ్బిలి మండలం దిబ్బగుడ్డివల్స గ్రామం నుండి కళాకారులు అమరులను స్మరిస్తూ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. మక్కువ, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం తదితర మండలాల పరిధిలో సుమారు 50 గ్రామాల నుండి 1200 మంది గిరిజన, గిరిజనేతర పేదలు హాజరైనారు. ప్రజాకళాకారుల పాటలు, నృత్యాలు, ప్రజలను ఆకట్టుకొన్నాయి.

ooooo